## క్లుప్తంగా

### 20న ఉచిత కంటి వైద్య శిబిరం

బేస్తవారిపేట: స్థానిక సాయిబాబా రోడ్డులోని ధరణి ఐటీఐ కళాశాల ఆవరణలో ఈనెల 20న ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు చేయూత మిత్ర మండలి సభ్యులు తెలిపారు. వసుధ కాలిఫోర్నియా, హైదరబాద్ సెయింట్ ఫౌండేషన్, ఫ్రెండ్స్ ఆఫ్ నీడ్ సొసైటీ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహిస్తారన్నారు. కంటి శుక్లాలకు ఉచితంగా ఆపరేషన్ చేయించడం, ఉచిత భోజన వసతి కల్పిస్తాన్నారు. ఓటరు కార్డు, ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీలు తీసుకుని హాజరు కావాలని కోరారు.

### తెప్పోత్సవానికి ఏర్పాట్లు పూర్తి

రాచర్ల: నెమలిగుండ్లరంగనాయకస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా సోమవారం నీటి గుండంలో జరిగే తెప్పోత్సవానికి అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లుగా దేవస్థాన కార్యనిర్వహణాధికారి మల్లవరపు నాగయ్య తెలిపారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆదివారం రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. మధ్యాహ్నం 3గంటలకు జేపీ చెరువు వారిచే కోలాటాన్ని ప్రదర్శించారు. రాత్రి 7 గంటలకు పాడుతా తీయగా మహా సంగ్రామం విన్నర్ వారిచే పాట కచ్చేరి నిర్వహించారు. రాత్రి 11 గంటలకు వెంకటేశ్వర నాట్యమండలి వారిచే చింతామణి పూర్తి నాటాకాన్ని ప్రదర్శించారు.

### ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష


గురుకుల ప్రవేశ పరీక్షను పరిశీలిస్తున్న ఎంఈఓ

కంభం: ఆదివారం జరిగిన గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. స్థానిక గురుకుల పాఠశాలలోని పరీక్ష కేంద్రాన్ని మండల విద్యాశాఖాధికారి మాల్యాద్రి పరిశీలించారు. ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఉచితంగా విద్య, వసతి, క్రీడా సౌకర్యాలను అందించనున్నట్లు తెలిపారు. ఎంఈఓతో పాటు గురుకుల ప్రిన్సిపాల్ చాముండేశ్వరీ ఉన్నారు.

### బ్రహ్మోత్సవాలకు తరలి వెళ్లిన భక్తులు


కంభం బస్టాండులో బస్సు ఎక్కుతున్న భక్తులు

కంభం: రాచర్ల మండలం జేపీ చెరువు సమీపంలో జరుగుతున్న నెమలిగుండ్ల రంగనాయక స్వామి బ్రహ్మోత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలి వెళ్లారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి కంభం వచ్చిన భక్తులు అక్కడి నుంచి ఆటోలు, ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాల్లో బయలుదేరి వెళ్లారు. ఆర్టీసీ అధికారులు భక్తులకు సరిపడా బస్సులు ఏర్పాటు చేయక పోవడంతో ఇబ్బందులు పడుతూనే వెళ్లారు.

### పేద వైశ్య విద్యార్థులకు అండగా ఉంటాం


శివలింగయ్యను సన్మానిస్తున్న ఆర్యవైశ్య నాయకులు

కంభం: వైశ్య బీద విద్యార్థి వసతి గృహ కమిటీ అధ్యక్షుడిగా బైసాని లక్ష్మీ వెంకట రంగనాయకులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా 6 మంది పేద వైశ్య విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ. 10 వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. పేద వైశ్య విద్యార్థులకు వసతి గృహ కమిటీ అన్ని వేళలా అండగా ఉంటుందన్నారు. అనంతరం గతంలో కమిటీ అధ్యక్షుడిగా ఉన్న ఆలంపల్లి శివలింగయ్యను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కమిటీ గౌరవాధ్యక్షుడ ఒగ్గు శ్రీనివాసులు, తిరువీధి మల్లికార్జున, డాక్టర్ బైసాని రామక్రిష్ణ, తదితరులు పాల్గొన్నారు.

### కోటా సత్యమాంబదేవికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో కోటా సత్యమాంబదేవి

బేస్తవారిపేట: మండలంలోని గొట్టమిండ్ల కోటా సత్యమాంబదేవి, బేస్తవారిపేట, పాపాయిపల్లె గ్రామాల్లోని పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కోటా సత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారికి అర్చనలు, సహస్రనామ, కుంకుమపూజలు, అఖండహారతి పూజలు చేశారు. పలు గ్రామాల భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు.

# ముస్లింల నెత్తిన.. కూటమి టోపీ !

- ముస్లింల కల నెరవేరేనా.. !
- అర్ధాంతరంగా ఆగిన షాదీఖానా నిర్మాణం
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- గతం ప్రభుత్వంలో ముస్లింలకు పెద్దపీట
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ముస్లింలు

మార్కాపురం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముస్లింల అభివృద్ధిని మరిచిపోయింది. అధికారంలోకి రాకముందు ముస్లింలకు మద్దతుగా ఉంటాం.. అని అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చింది. దాంతోపాటుగా ముస్లింలకు అన్యాయం జరుగుతోందన్న వక్ఫ్ బిల్లులకు సైతం కూటమి మద్దతు పలికి ముస్లింలను నట్టేట ముంచింది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సుమారు రూ.2 కోట్ల వ్యయంతో మార్కాపురం ప్రాంత ముస్లింల చిర కాల కలను నెరవేర్చేందుకు కంభం సెంటరులో షాదీఖానా నిర్మాణాన్ని చేపట్టారు. దాదాపు 70 శాతానికి పైగా పనులు పూర్తయ్యాయి. మార్చిలో ఎన్నికల కోడ్ రావడంతో పనులు నిలిచిపోయాయి. అనంతరం కూటమి ప్రభుత్వం రావడంతో షాదీఖానా నిర్మాణం గత పది నెలల నుంచి అర్ధాంతరంగా నిలిచింది. రాత్రిపూట అసాంఘిక కార్యక్రమాలకు వేదికగా మారడంతో పలువురు ముస్లింలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్కాపురం పట్టణం, మండలంలో సుమారు 15 వేల మందికి పైగా ముస్లింలు ఉన్నారు. శుభకార్యాలతో పాటు వివిధ కార్యక్రమాలను నిర్వహించు కునేందుకు శాశ్వత భవనం లేకపోవడంతో గత 20 ఏళ్లుగా షాదీఖానా కోసం ప్రయత్నాలు చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం, విభజన అనంతరం టీడీపీ ప్రభుత్వంలో షాదీఖానా నిర్మాణానికి శిలాఫలకాలు ఆవిష్కరించారే కానీ నిధులు కేటాయించలేదు.


అసంపూర్తిగా నిలిచిన షాదీఖానా నిర్మాణం

**నిధులు కేటాయించిన వైఎస్సార్ సీపీ..**

అయితే గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి నాటి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితో మాట్లాడి ప్రత్యేకంగా రూ.2 కోట్ల నిధులను కేటాయించారు. వెంటనే టెండర్లు పిలవడం, పనులు ప్రారంభించడం చకచకా జరిగిపోయాయి. ప్రస్తుత మార్కాపురం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు కూడా షాదీఖానా నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించి గతేడాది ఎన్నికలకు ముందు షాదీఖానా నిర్మాణాన్ని త్వరగా పూర్తిచేయాలని ఆదేశించడంతో పనులు త్వరితగతిన జరిగాయి. ముస్లింల కల నెరవేరే దశలో ఎన్నికల కోడ్ అమలులోనికి రావడంతో పనులు నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం రాగానే మళ్లీ పనులు జరుగుతాయని ముస్లింలు ఆశతో ఎదురు చూశారు. 10 నెలలు కావస్తున్నా పనుల్లో పురోగతి లేదు. దీనితో షాదీఖానా నిర్మాణం ఎప్పటికి పూర్తవుతుందో తెలియని పరిస్థితి ఏర్పడింది.

**షాదీఖానా పూర్తయితే..**

షాదీఖానా నిర్మాణం పూర్తయితే మార్కాపురం పట్టణంతోపాటు పరిసర గ్రామాలైన వేములకోట, చింతగుంట్ల, తిప్పాయిపాలెం, నికరంపల్లి, దరిమడుగు, రాయవరం, గజ్జలకొండ, ఇడుపూరుతో పాటు తర్లుపాడు పెద్దారవీడు మండలాల ముస్లింలందరికీ కూడా వివాహాది శుభకార్యాలు నిర్వహించుకునేందుకు ఉపయోగపడుతుంది. ప్రస్తుతం షాదీఖానా లేకపోవడంతో ముస్లింలు వివిధ కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు అత్యధిక రెట్లు చెల్లించి పట్టణంలో ప్రైవేటు ఫంక్షన్ హాల్స్‌ను ఉపయోగించుకుంటున్నారు. ఇది పూర్తయితే తక్కువ అద్దెతో వివిధ కార్యక్రమాలు నిర్వహించుకునే అవకాశం ఉంది. కూటమి ప్రభుత్వం ఇప్పటికైనా షాదీఖానా నిర్మాణాన్ని పూర్తిచేయాలని ముస్లింలు కోరుతున్నారు. లేకపోతే ముస్లింల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని వారు హెచ్చరిస్తున్నారు.


పూజలు నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే దంపతులు

## రంగనాయకస్వామికి అన్నా పూజలు

రాచర్ల: నెమలిగుండ్ల రంగనాయకస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం నిర్వహించిన శ్రీదేవి, భూదేవి సమేత నెమలిగుండ్ల రంగనాయకస్వామి కల్యాణానికి వచ్చిన గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి అన్నా వెంకట రాంబాబు, సతీమణి దుర్గాకుమారిలకు ఆలయా అర్చకులు స్వామివారి పట్టువస్త్రలతో సత్కరించి, తలంబ్రాలను అందజేసి ఘన సన్మానం చేశారు. అనంతరం స్వామివారి ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీస్సులను పొందారు. కార్యక్రమంలో దేవస్థాన మాజీ చైర్మన్ కన్నసాని ఓబులేసు, అనుములపల్లె సర్పంచ్ సిరిగిరి రమేష్, చోళ్లవీడు మాజీ సర్పంచ్ ముత్యాల మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

## గౌడ అన్నదాన సత్రం కమిటీ ఎన్నిక


నూతనంగా ఎన్నికైన గౌడ అన్న సత్రం కమిటీ సభ్యులు

కొనకనమిట్ల: పుణ్యక్షేత్రం వెలుగొండ వెంకటేశ్వర స్వామి సన్నిధిలోని గౌడ అన్నదాన సత్రం అభివృద్ధికి నూతన కమిటీ కృషి చేయాలని ఆ సంఘం కమిటీ ముఖ్యులు ఇల్లూరి రంగస్వామిగౌడ్, కంచర్ల కాశయ్య గౌడ్, కీర్తి సాయన్న కోరారు. ఆదివారం వెలుగొండలోని గౌడ అన్నదాన సత్రం ఆవరణలో సత్రం నూతన కమిటీని ప్రస్తుత అధ్యక్షులు కంచర్ల నడిపి వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో ఏకగ్రీంగా ఎన్నుకున్నారు. సత్రం గౌరవ అధ్యక్షుడిగా సాయన్న, అధ్యక్షుడిగా దొంతా కృష్ణగౌడ్ ప్రధాన కార్యదర్శిగా దోసపాటి వెంకటేశ్వర్లు, కోశాధికారిగా అలగాని కృష్ణయ్య, ఉపాధ్యక్షులుగా గోసపాటి బ్రహ్మం, గోరా రంగయ్య, కె.శ్రీనివాస్, హరి, వెంకటేశ్వర్లు, సభ్యులుగా అంకయ్య, వెంకటనరసయ్య, బాలగురవయ్య, ఎల్లయ్య, నరసయ్య, రావుల చెన్నకేశవులు, హనుమయ్య, శ్రీనివాసరావులను ఏకగ్రీంగా ఎన్నుకున్నారు.

## శాంతిమార్గంలో జీవించడమే క్రీస్తుకు ఇష్టం



బేస్తవారిపేటలో ర్యాలీ చేస్తున్న క్రైస్తవులు


మార్కాపురంలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న పాస్టర్లు, చిన్నారులు

- భక్తిశ్రద్ధలతో మట్టల ఆదివారం

కొనకనమిట్ల: ప్రజలు శాంతి మార్గంలో జీవించడమే లోకరక్షకుడైన ఏసుకు ఇష్టమని సువార్తకులు గొంగటి కిషోర్‌కుమార్, జాన్, మారంరెడ్డి కాశిరెడ్డి అన్నారు. మట్టల ఆదివారాన్ని పురస్కరించుకుని మండలంలోని కొనకనమిట్ల, గొట్లగట్టు, ఎదురాళ్లపాడు, వద్దిమడుగు, పెదారికట్ల చర్చిలలో ప్రత్యేక కూటములు నిర్వహించి మట్టలతో ర్యాలీ నిర్వహించారు. ఆయా చర్చిల్లో సందర్భంగా ఏసుక్రీస్తు అనుకరించిన ఏడు సప్తసూక్తులను గురించి వివరించారు. దేవుడిని నమ్ముకున్న వారికి చీకటిలో కాంతిలా, ఆపద వేళల్లో మిత్రుడిలా ఏసురక్షణ ఉంటుందన్నారు.

మార్కాపురం: ఈస్టర్ పండుగకు ముందుగా వచ్చే ఆదివారాన్ని మట్టల ఆదివారంగా భావించి ఘనంగా నిర్వహించారు. పాస్టర్ ఎం వరప్రసాద్, ఫ్రాన్సిస్, సాల్మన్‌రాజ్, తెలుగు బాప్టిస్టు టౌన్‌చర్చి పాస్టర్ పులుకూరి అమృత్‌తేజ్‌లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సండే స్కూల్ సూపరింటెండెంట్ గంగాభవానీ, వీబీఎస్ డైరెక్టర్ సుస్మిత, యూత్ డైరెక్టర్ సౌమ్య, చర్చి అధ్యక్ష కార్యదర్శులు సామ్యేలు, జయరావు, రామస్వామి తదితరులు పాల్గొని ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైయస్సార్‌సీపి వార్డు ఇన్‌చార్జి ఉత్తమ్‌కుమార్, పలువురు పాస్టర్లు, పాల్గొన్నారు.

**బేస్తవారిపేటలో**

బేస్తవారిపేట: స్థానిక టీచర్స్ కాలనీలోని బిలీవర్స్ ఈస్టర్న్ చర్చిలో మట్టల ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. 40 రోజుల ఉపవాస దీక్షల ముగింపు సందర్భంగా చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రీస్తు చూపిన ప్రేమ, దయ, కరుణ మార్గాలలో ప్రతి ఒక్కరూ నడవాలని ఫాదర్ గుర్రం జాన్ రంగయ్య కోరారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు చిట్టిబాబు, పౌలుబాబు, కిషోర్, ఆశాజ్యోతి, యాకోబు పాల్గొన్నారు.


కొనకనమిట్ల: మట్టలతో చిన్నారులు

## క్రమశిక్షణతో ఉత్తమ ఫలితాలు సాధ్యం



కళాశాల విద్యార్థులతో వెన్నా హనుమారెడ్డి

మార్కాపురం: క్రమశిక్షణతో ఉత్తమ ఫలితాలు సాధించి అనుకున్న కలలను నెరవేర్చుకోవచ్చని ఏపీ పొల్యూషన్ బోర్డు మాజీ సభ్యుడు, వైఎస్సార్ సీపీ నాయకులు వెన్న హనుమారెడ్డి తెలిపారు. చైతన్య ఫార్మసీ కళాశాల విద్యార్థుల వీడ్కోలు సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కళాశాలలో నేర్చుకున్న చదువును నిజజీవితంలో ఉపయోగపడే విధంగా పరిశోధనలు చేయాలన్నారు. ఫార్మసీ విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉందని, దేశ విదేశాల్లో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు. రోజు రోజుకూ వస్తున్న కొత్త జబ్బులకు మందులు కనిపెట్టాల్సిన బాధ్యత ఫార్మాసిస్టులపైనే ఉందన్నారు. మందుల వాడకంలో ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఫార్మాసిస్టులపై ఉందన్నారు. గ్రామీణప్రాంతాలకు వెళ్లి మందుల వినియోగంపై సదస్సులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు హనుమారెడ్డి బహుమతులు అందజేశారు. ప్రిన్సిపల్ రజనీ, కళాశాల కరస్పాండెంట్, తర్లుపాడు జెడ్పీటీసీ వెన్నా ఇందిర, సిబ్బంది పాల్గొన్నారు.

## అపూర్వం పూర్వ విద్యార్థుల కలయిక


వేదికపై పూర్వ విద్యార్థులు, అప్పటి ఉపాధ్యాయులు

కొమరోలు: మండలంలోని గోపాలునిపల్లె ఏబీఎం ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో ఆదివారం 1999–2000 విద్యా సంవత్సరానికి చెందిన 10వ తరగతి పూర్వ విద్యార్థుల అపూర్వ ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా 25 ఏళ్ల తరువాత నిర్వహించిన సిల్వర్ జూబ్లీ వేడుకల్లో పూర్వ విద్యార్థులు కలుసుకుని ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో పాల్గొన్న నాటి విద్యార్థులు తమ బాల్యాన్ని గుర్తుకు తెచ్చుకున్నారు. అనంతరం తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కొద్దిసేపు ఆటపాటలతో అప్పటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు.

### వెంకట రంగయ్య ఆదర్శాలు కొనసాగించాలి


వెంకట రంగయ్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కందుల

తర్లుపాడు: గ్రామాభివృద్ధికి కృషి చేస్తూ 35 సంవత్సరాల పాటు సర్పంచ్‌గా కొనసాగిన వెంకట రంగయ్య బాటలో అందరూ నడవాలని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సూచించారు. ఆదివారం మండలంలోని సూరేపల్లి గ్రామంలో మాజీ సర్పంచ్ స్వర్గీయ వెంకట రంగయ్య విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒక వ్యక్తి 35 యేళ్లపాటు పదవిలో కొనసాగటం ప్రజల అభిమానానికి నిదర్శనమని, ప్రజా ప్రతినిధులు ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ నవ్వ రమణయ్య, జనసేన ఇన్‌చార్జి ఇమ్మడి కాశీనాథ్, మాజీ మండల అధ్యక్షులు రావి వెంకటరెడ్డి పాల్గొన్నారు.

## పలువురికి అంబేడ్కర్ అవార్డులు


అవార్డు అందుకుంటున్న డాక్టర్ చిన్ననరసయ్య


అవార్డు అందుకుంటున్న గఫార్

కంభం/కొమరోలు: సామాజిక సేవలో తమవంతుగా కార్యక్రమాలు చేసిన పలువురికి అంబేడ్కర్ అవార్డులు లభించాయి. స్థానిక ఎంజీ బీఈడీ కళాశాల కరస్పాండెంట్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర మైనారిటీ సెల్ సెక్రటరీ ఎం.ఎ. గఫార్ ఎ గోరీ సమాజంలో చేస్తున్న సేవాకార్యక్రమాలు, విద్యారంగంలో అందిస్తున్న సేవలకుగాను డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జాతీయ ప్రతిభా అవార్డు అందుకున్నారు. సాథరన్ ప్రైవేట్ లెక్చరర్స్, టీచర్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో గుంటూరులోని ఆంధ్రాక్రిస్టియన్ కళాశాలలో ఆదివారం నిర్వహించిన అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో గఫార్‌ను శాలువాతో సత్కరించి అవార్డు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీలు డొక్కా మాణిక్య వరప్రసాద్, కె. లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

**చిన్ననరసయ్యకు అవార్డు..**

కొమరోలు మండలంలోని కసినేనపల్లె గ్రామానికి చెందిన డాక్టర్ బిజ్జం చిన్ననరసయ్య చేసిన సామాజిక సేవలకు గాను ఆయన అంబేడ్కర్ అవార్డుతో సత్కరించారు. దక్షిణాది ప్రైవేటు లెక్చరర్లు టీచర్స్ ఆర్గనైజేషన్ వారికి డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ జాతీయ ప్రతిభ అవార్డును ఆదివారం అందజేశారు. గుంటూరులోని ఏసీ కళాశాలలో నరసయ్య ఈ అవార్డును మాజీ ఎమ్మెల్సీలు లక్ష్మణరావు, డొక్కా మాణిక్యవరప్రసాద్ చేతుల మీదుగా అందుకున్నారు.

## వైభవంగా సీతారాముల కల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న భక్తులు

కొనకనమిట్ల: అంతా రామమయం.. జగమంతా రామమయం అంటూ సీతారాముల కల్యాణ మహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. మండలంలోని పాతపాడులో పట్టాభిరామస్వామి ఆలయంలో ఆదివారం సీతారాముల కల్యాణాన్ని భక్తుల కోలాహలం నడుమ నిర్వహించారు. కల్యాణ ఉభయ దాతలుగా పలువురు దంపతులు వ్యహరించారు. వేదపండితులు నారాయణశర్మ స్వామి వారికి అర్చనలు, అభిషేకాలు నిర్వహించి కల్యాణ ఘట్టాన్ని జరిపించారు. కల్యాణం అనంతరం రైతులు తమ ఎడ్లను పూజించి స్వామివారికి పానకం బండ్లు కట్టి మొక్కులు తీర్చుకున్నారు. కల్యాణం సందర్భంగా మహిళల కోటాటం ప్రదర్శించారు. సోమవారం అన్నదాన కార్యక్రమం, సీతారాముల పట్టాభిషేకం ఉత్సవం, రాత్రికి నెల్లూరు వారిచే చెంచులక్ష్మి పౌరాణికం, మంగళవారం రథోత్సం, వసంతోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. కాగా పాతపాడు ఎస్సీ కాలనీలో సీతారాముల కల్యాణం వేడుకగా నిర్వహించారు. కాలనీ ప్రజలు సీతారాములకు పానకం, వడపప్పు నైవేద్యాలుగా సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు.


అలంకరణలో సీతారాములు

### 17న మండల పరిషత్ సమావేశం

కొనకనమిట్ల: ఈ నెల 17న ఉదయం 10 గంటలకు మండల పరిషత్ కార్యాలయ సమావేశ హాలులో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణయాదవ్ అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఈశ్వరమ్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో గ్రామాల అభివృద్ధిలో తీసుకోవాల్సిన అంశాలపై అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహిస్తారని, కావున మండలంలోని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు వారి నివేదికలతో సమావేశానికి హాజరుకావాలన్నారు. జెడ్పీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కో ఆప్షన్ సభ్యులు హాజరు కావాలని ఎంపీడీవో కోరారు.

### సెల్‌ఫోన్‌లో బెట్టింగ్ యాప్‌లు ఉంటే చర్యలు


సెల్‌ఫోన్‌లను పరిశీలిస్తున్న ఎస్సై సైదుబాబు

మార్కాపురం: సెల్‌ఫోన్‌లో బెట్టింగ్ యాప్‌లు ఉంటే వెంటనే వాటిని తొలగించాలని ఎస్సై సైదుబాబు తెలిపారు. ఆదివారం పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేసి పలువురి సెల్‌ఫోన్‌లను తనిఖీ చేశారు. ఎవరైనా ఆన్‌లైన్ బెట్టింగ్‌లు, క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవటంతో పాటు జైలు శిక్ష పడుతుందన్నారు. గంజాయి అమ్మినా, తాగినా వారిపై కూడా కేసు నమోదు చేస్తామన్నారు. పలువురి సెల్‌ఫోన్‌లలో ఉన్న బెట్టింగ్ యాప్‌లను ఆయన తొలగించారు.